క్లుప్తంగా

గర్భిణులకు విశిష్ట సేవలను అందించాలి

చింతకొమ్మదిన్నె : మండలంలోని గర్భిణులకు, బాలింతలకు విశిష్ట సేవలను అందించాలని డీఎం అండ్ హెచ్‌ఓ వైద్యాధికారి ఖాదర్‌వల్లి తెలిపారు. గురువారం మండలంలోని రసూల్‌పల్లె గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాంను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల ప్రాథమిక ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్ళి గర్భిణులకు, బాలింతలకు అవసరమైన సేవలను అందించాలన్నారు. బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తుల పట్ల ఎప్పటికప్పుడు వివరాలను సేకరించి వారికి వైద్య సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన భాగవత సప్తాహం

సింహాద్రిపురం : మండల పరిధిలోని కసనూరు గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన భాగవత సప్తాహం గురువారం నాటితో ముగిసింది. గ్రామ సుభిక్షం కోసం గ్రామంలోని ఆలయంలో భాగవత సప్తాహం గావించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శుభకార్యానికి ఆర్థిక సాయం

చెన్నూరు : చెన్నూరు కొత్త గాంధీనగర్‌కు చెందిన లేవాకు పుష్పరాజు చెన్నమ్మల కుమార్తె వివాహ శుభకార్యానికి ఆర్థిక సాయంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రనాథ్‌రెడ్డి పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారికి గురువారం రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ ఆమూరిరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చెన్నూరు : మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పుల్లారెడ్డి అన్న వెంకటరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకపోవడంతో ఆయన గురువారం కొండపేట గ్రామంలోని మృతుడి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటరెడ్డి మరణం పార్టీకి తీరని లోటని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, గణేష్‌రెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రవాణా పన్నులను తగ్గించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పెట్రోల్, డీజిల్‌పై అత్యధిక పన్నులు వసూలు చేస్తున్నారని, వాటిని తగ్గించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కెసీ బాదుల్లా పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరుకు రవాణా వాహనాలపై త్రైమాసిక పన్నులు పెంచడంతో నిత్యావసర సరుకుల ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు లింగన్న పాల్గొన్నారు.

శానిటరీ సెక్రటరీల ఆగడాలను అరికట్టాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో కొందరు శానిటరీ సెక్రటరీల ఆగడాలను అరికట్టాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్షుడు సుంకరి రవి కోరారు. గురువారం కమిషనర్ ప్రవీణ్‌చంద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. ప్రశాంత్‌వర్ధన్‌కు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల పట్ల శానిటేషన్ సెక్రటరీల వైఖరి మారకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కంపోస్టు యార్డు వద్ద సీసీ కెమెరాలు, బారికేడ్లు, వీధి దీపాలు, నీటి వసతి, మేస్త్రీలకు రూమ్ వసతి కల్పించాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ సమస్యలు పరిష్కరించాలన్నారు. రోడ్డు విస్తరణలో పూర్తిగా ఇళ్లు కోల్పోయిన వారికి ఆప్కాస్‌లో ఉద్యోగం ఇవ్వాలన్నారు.

పదోన్నతుల అనుమానాలను నివృత్తిచేయాలి

వైవీయూ : విద్యాశాఖ విడుదల చేసిన ఉపాధ్యాయుల పదోన్నతుల మార్గదర్శకాలు, షెడ్యూల్‌పై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీవీ ప్రసాద్ కోరారు. గురువారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాత ప్రభుత్వ ఉత్తర్వు 12 ప్రకారం అర్హతలను నిర్ణయిస్తే తదుపరి మార్పులు, చేర్పుల ద్వారా వచ్చిన అర్హతల ద్వారా ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరిస్తారో తెలపాలన్నారు. హైస్కూల్ ప్లస్‌లో పనిచేసే స్కూల్ అసిస్టెంట్‌ల హోదాల్లో మార్పులు ఉండాలన్నారు. బదిలీలకు సంబంధించిన అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్‌చంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు హెల్ప్‌డెస్క్

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీలలో చేరగోరే విద్యార్థుల కోసం కళాశాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. విద్యార్థులు తమ పేర్లను హెల్ప్‌డెస్క్ ద్వారా నమోదు చేసుకుని అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఆన్‌లైన్ అడ్మిషన్ల కోసం కళాశాల పనివేళల్లో కానీ, 98497 65838, 91776 82848 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో స్మార్ట్ సేవలు

- కేంద్రాల వివరాలు యాప్‌లో నమోదు
- పులివెందుల నియోజకవర్గంలో 2013 అంగన్‌వాడీ కేంద్రాలు
- అందులో 15,490 మంది చిన్నారులు, 1632 మంది బాలింతలు, 1929 మంది గర్భిణులు ఉన్నారు



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

పులివెందుల రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలకు, గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఇప్పటికే ఈ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు మెరుగైన సేవలు అందించడం జరుగుతోంది. ఈ సేవలు సక్రమంగా అందేలా అక్రమాలకు చెక్ పెట్టేందుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ స్మార్ట్ సేవలకు శ్రీకారం చుట్టింది. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో 2013 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 15,490 మంది చిన్నారులు, 1632 మంది బాలింతలు, 1929 మంది గర్భిణులు ఈ కేంద్రాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. వారికి అందించే పౌష్టికాహారం, తాగునీరు, మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు, అక్రమాలకు తావు లేకుండా కేంద్రాల వివరాలను పొందుపరిచేందుకు యాప్‌లను ఉపయోగిస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి పోషణ ట్రాకర్ యాప్‌లు ఉన్నాయి. ఈ యాప్‌ల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలలో కల్పించే మౌలిక సదుపాయాలు, పిల్లలకు, గర్భిణులకు అందించే పౌష్టికాహారం యాప్‌లలో పొందుపరుస్తున్నారు. అలాగే కేంద్రాల లో మధ్యాహ్న భోజనం నిర్వహణ నాణ్యత లోపిస్తే యాప్‌లో వివరాలు నమోదవుతాయి.

వివరాలు నమోదు చేస్తున్నాం



ప్రభుత్వం అందజేసిన స్మార్ట్ ఫోన్లలో అంగన్‌వాడీ సెంటర్‌కు సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేస్తున్నాం. యాప్‌లకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతల హాజరు, పౌష్టికాహారం రిపోర్టులను ఎప్పటికప్పుడు నమోదు నమోదు చేస్తున్నాం.

– సలీమా(అంగన్‌వాడీ కార్యకర్త), పులివెందుల.

పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి



పులివెందుల నియోజకవర్గ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు మధ్యాహ్న భోజనం, కోడి గుడ్లు, పాలు, బాలామృతం, అటుకులు, రాగి, జొన్న పిండి, బెల్లం చెక్కలతో కూడిన కిట్లను సరఫరా చేస్తున్నారు. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేసేందుకు రెండు ప్రత్యేక యాప్‌ల ఉపయోగిస్తున్నాము. పోషన ట్రాకర్ యాప్‌లో రోజు చిన్నారులు, బాలింతలు, గర్భిణుల హాజరు నమోదు చేస్తున్నారు. చిన్నారులు ఎత్తు, బరువు కొలతలు కూడా నమోదు చేస్తున్నారు. యాప్‌లపై సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం జరిగింది.

– సునీత (సీడీపీఓ), పులివెందుల.

జాతీయస్థాయి జంప్ రోప్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని ప్రసన్నకు ఆర్థిక సాయం అందిస్తున్న కోలా ప్రసాద్

పులివెందుల టౌన్ : జాతీయస్థాయి జెంప్ రోప్ పోటీలకు పులివెందులకు చెందిన ఆర్.ప్రసన్న అనే విద్యార్థిని ఎంపికై ంది. ఈ విద్యార్థిని వచ్చేనెల 20వ తేదీన మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినిలో జరిగే జాతీయస్థాయి జెంప్ రోప్ పోటీలలో పాల్గొననుంది. ఈ విద్యార్థినికి కోలాప్రసాద్ రూ.6 వేలు ఆర్థిక సాయం అందించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తేనే ప్రమాదాల నివారణ

– పులివెందుల డీఎస్పీ వినోద్ కుమార్



వాహనదారులతో మాట్లాడుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్

పులివెందుల : ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం ఉదయం పట్టణంలోని స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ సీఐ వెంకటేశులు, ట్రాఫిక్ హాజీవల్లిలతో కలిసి డీఎస్పీ వినోద్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. విపరీతమైన స్పీడ్‌తో వాహనాలు నడపడం, అలాగే ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా అడ్డదిడ్డంగా వాహనాలు నడపడంవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నీతివాక్యాల బోధన



పులివెందులలో కథలు చెబుతున్న లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి



వల్లూరు గ్రంథాలయంలో ఆటలు ఆడుతున్న పిల్లలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా గురువారం వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి విద్యార్థులకు నీతి వాక్యాలను బోధించారు. అలాగే లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి విద్యార్థులకు మంచి కథలను చెప్పారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : పుస్తక పఠనం వలన అనేక ప్రయోజనాలు వున్నాయని వల్లూరు శాఖ గ్రంథాలయ అధికారిణి వెంకటేశ్వరమ్మ తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె పలువురు పిల్లలకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు క్యారమ్స్, లూడో, చెస్ మొదలైన ఆటలను నేర్పించి వారి చేత ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని లైబ్రేరియన్ గంగాధర యాదవ్ తెలిపారు. గురువారం స్థానిక వేముల శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులందరూ పుస్తక పఠన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలను చదవడం ద్వారా మంచి అలవాట్లు, మంచి నడవడిక చేకూరుతాయన్నారు. ఒక మంచి పుస్తకం ఒక మంచి స్నేహితుడితో సమానమన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షల పుస్తకాలతోపాటు పౌరాణిక తదితర పుస్తకాలను చదవాలన్నారు. అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు, పాటలు పాడించడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ జర్మియ, పాఠకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : స్థానిక గ్రంథాలయశాఖ నిర్వహిస్తున్న వేసవి శిక్షణలో గురువారం పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ అందించామని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఉమాదేవి తెలిపారు. విశ్రాంతి ఉపాధ్యాయులు జగన్నాథం, పాఠకులు, పిల్లలు పాల్గొన్నారు.

‘స్పందన’కు విశేష స్పందన



ప్రజలనుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్ తదితరులు

లింగాల : మండలంలో మురారిచింతల సచివాలయంలో గురువారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎంపీడీఓ సురేంద్రనాథ్, తహసీల్దార్ లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో స్పందన సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజల సమస్యలపై అధికారులకు అర్జీలను అందించారు. ఈనెల 22న వెలిదండ్ల, 25న ఇప్పట్ల, 29న లింగాల, జూన్ 1వ తేదీన కామసముద్రం, 5న పెద్దకుడాల, 8న పార్నపల్లె, 12న కోమన్నూతల సచివాలయాల్లో స్పందన సదస్సులు నిర్వహించనున్నామన్నారు. ప్రజలందరూ ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం :

లింగాలలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీ సురేంద్రనాథ్ అన్నారు. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, పంచాయతీ ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాబులతో కలిసి మండల కేంద్రమైన లింగాల వీధులలో పర్యటించారు. నీటి వృథాను అరికట్టి యుద్ధ ప్రాతిపదికన పైపులైన్ లీకేజీలను అరికట్టి ప్రజలకు తాగునీరు అందిస్తామన్నారు.

‘స్పందన’ అర్జీల పరిశీలన

పెండ్లిమర్రి : మండలంలోని మాచునూరు గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన స్పందన కార్యాలయాన్ని మండలస్థాయి అధికారులు పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్‌లు పరిశీలించి ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అలాగే స్పందన కార్యక్రమాన్ని ప్రతి గ్రామ సచివాలయంలో తప్పని సరిగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సుబ్బయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శేఖర్, ఏపీఓ రామాంజనేయరెడ్డి, ఏపీఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రోషన్

సింహాద్రిపురం : స్థానిక హిమకుంట్ల క్రాస్ వద్ద గురువారం సాయంత్రం ఎస్‌ఐ రోషన్ వాహనాల తనిఖీ నిర్వహించి పత్రాలు సరిగాలేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహనాల పత్రాలు కలిగి ఉండాలని.. లేకుంటే జరిమానాలు తప్పవన్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

వైవీయూ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హకీముద్దీన్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్నత్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ నిర్వహించారు.

జగనన్న ఇంటి నిర్మాణాలను పూర్తి చేయండి

– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి



ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

సింహాద్రిపురం : జగనన్న ఇంటి నిర్మాణాలు, వ్యక్తిగతంగా నిర్మించుకుంటున్న లబ్ధిదారులు వారంలోపు ఇంటి పనులను పూర్తి చేయాలని ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొత్తగా లబ్ధిదారుల పేర్లు తీసుకున్న వాటిని డీపీఆర్‌లోని నిర్మాణం చేయని లబ్ధిదారుల పేర్ల స్థానంలో వీటిని చేర్చి నూతన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ పేమెంట్ బిల్లులు 15 రోజుల్లో లబ్ధిదారుల అకౌంట్‌లో పడేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రమణారెడ్డి, మండల స్పెషలాఫీసర్ నాగలింగచార్యులు, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏపీఎం మంజునాథ, హౌసింగ్ ఏఈ వాసుదేవారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శేఖర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కోచింగ్.. పేద విద్యార్థులకు గొప్ప వరం



మాట్లాడుతున్న కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్

పులివెందుల టౌన్ : ఉచిత కోచింగ్ నిర్వహణ పేద విద్యార్థులకు గొప్ప వరమని కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్ తెలిపారు. గురువారం పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్)లో స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సహకారంతో నెల రోజులుగా నిర్వహిస్తున్న ఏపీఆర్‌జేసీ ప్రవేశాలకు ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్నపల్లె కిశోర్ హాజరై మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు ఈ ఉచిత శిక్షణ ఏర్పాటు చేయడం గొప్ప వరమన్నారు. ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకరావాలన్నారు. అనంతరం ఉచిత విద్య ఉపాధ్యాయ బృందాన్ని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రాజు, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ నిర్ణయంపై ఉలేమాల హర్షం

కడప కల్చరల్ : హజ్ యాత్రికులకు మేలు చేకూరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై రాష్ట్ర ఉలేమా అయిమ్మా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. గురువారం కడప నగరంలోని సంస్థ కార్యాలయంలో సంస్థ గౌరవాధ్యక్షులు, హజ్‌కమిటీ డైరెక్టర్ మౌలానా వలీవుల్లా హుస్సేనీ సాహెబ్ మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల హజ్ యాత్రికులు ఒక్కొక్కరు ముందుకంటే 83 వేల రూపాయలు చెల్లించాల్సి వచ్చిందన్నారు. పేద ముస్లింలు ఈ మొత్తం చెల్లించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న ముఖ్యమంత్రి ప్రభుత్వ బాధ్యతగా భావించి ముందుకు రావడం అభినందనీయమన్నారు.

ముస్లిం మైనార్టీలపై సీఎంకు గల చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని కొనియాడారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు హజరత్ ముఫ్తీ మహమ్మద్‌అలీ బగ్దాదీసాహెబ్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత తొలిసారి గా హజ్‌యాత్రికుల సౌకర్యం కోసం విజయవాడ నుంచి నేరుగా యాత్రకు వెళ్లేలా ఎంబార్ కషన్ పాయింట్ తీసుకురావడం హర్షణీయమన్నారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జమ్మలమడుగు : క్రీడాకారిణిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద రెజరర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న రెజ్లింగ్ అసోషియేషన్ అధ్యక్షుడు బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో 25 రోజులుగా మహిళా రెజరర్లు తమపై జరిగిన లైంగికవేధింపులకు నిరసనగా జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు శివనారాయణ, శివకుమార్, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించడంలో

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

– పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనాథరెడ్డి



మున్సిపల్ నూతన కార్యాలయ భవనాలను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనాథరెడ్డి

పులివెందుల టౌన్ : ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనాథరెడ్డి తెలిపారు. గురువారం పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా పులివెందుల పురపాలక సంఘంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించి నీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ తదితర వాటిపై సమీక్షించి ప్రతి రోజు అన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్లు ఇంజనీర్లు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ప్రారంభం



వేంపల్లెలో ప్రారంభిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు



వేములలో.. సీఐ గోవిందురెడ్డి



వల్లూరులో.. ఎస్‌ఐ పెద్దఓబన్న

వేంపల్లె : పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం సీఐ జి.వెంకటేశ్వర్లు ప్రారంభించి మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలకు సౌకర్యార్థం ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామని ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నాయని అవసరమైన చోట దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని సూచించారు. అలాగే మూడు రోజుల నుంచి ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుపాల్ నాయక్, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : కలమల్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో చలివేంద్రాన్ని కలమల్ల ఎస్‌ఐ సంజీవరెడ్డి కొండాపురం సీఐ సుదర్శన్ ప్రసాద్ చేతుల మీదుగా గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఎండతీవ్రత అధికంగా ఉండటంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

వేములలో..

వేముల : స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రూరల్ సీఐ గోవిందురెడ్డి ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చలివేంద్రంలో చల్లని నీరు ప్రజలకు అందించాలని సిబ్బందికి సూచించారు. చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన వారికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎస్‌ఐ ధనంజయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : స్థానిక బస్టాపు వద్ద పోలీసుశాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఎస్‌ఐ పెద్దఓబన్న గురువారం ప్రారంభించి మాట్లాడారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి మండలంలోని పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటుకు తోడ్పడాలని ఆయన కోరారు.

శ్రీకాశీవిశ్వేశ్వరుడికి మాసోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోని శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయ ప్రాంగణంలో గల శ్రీకాశీవిశ్వేశ్వరస్వామికి గురువారం మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం నిర్వహించి, పుష్పాలు, బంగారు ఆభరణాలతో కనులపండువగా అలంకరించారు. సాయంత్రం అర్చకులు పిడతల మురళీకృష్ణ, గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రదోషకాల పూజ నిర్వహించారు. ఉత్సవమూర్తులను నందివాహనంపై కొలువు తీర్చి పల్లకీసేవ నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి, దూపదీప నైవేద్యం, కర్పూరహారతి, అనంతరం ఆలయ ప్రాకారోత్సవాన్ని మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఉత్సవం ఘనంగా సాగింది. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.